క్లుప్తంగా

బాల నటుడికి డీఎస్పీ అభినందన



మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజుతో బాలనటుడు మోక్షజ్ఞ, అతడి తండ్రి సతీష్

మిర్యాలగూడ అర్బన్: పలు తెలుగు సినిమాలు, సీరియళ్లలో బాలనటుడిగా నటించిన మోక్షజ్ఞను మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు అభినందించారు. మోక్షజ్ఞ కుటుంబం ఖమ్మం పట్టణంలో నివాసముంటుండగా.. అతడి తండ్రి లింగం సతీష్, మిర్యాలగూడ డీఎస్పీ స్నేహితులు కావడంతో బుధవారం మిర్యాలగూడకు వచ్చి డీఎస్పీని కలిసినట్లు తెలిపారు.

శ్రీ వేంకటేశ్వర ఆలయానికి రూ.1.60 లక్షల విరాళం



దాత లలితను సన్మానిస్తున్న ఆలయ ధర్మకర్త

హాలియా : పట్టణంలోని సాయిప్రతాప్ నగర్ కాలనీలో ఉన్న స్వయంభూ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో గ్రనైట్ బండల ఏర్పాటుకు సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన ప్రవాస భారతీయుడు దొంతిరెడ్డి వేణు గోపాల్‌రెడ్డి, లలిత దంపతులు బుధవారం రూ. 1.60లక్షల విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త గోవర్ధనా రాఘవాచార్యులు దాత దొంతిరెడ్డి లలితకు స్వామివారి శేషవస్త్రాలు కప్పి సన్మానించారు.

సమగ్ర కుటుంబ సర్వే డబ్బులు ఇవ్వాలని వినతి

మిర్యాలగూడ టౌన్ : సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించి ఇస్తామన్న రూ.10 వేలు ఇవ్వాలని కోరుతూ బుధవారం అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో మిర్యాలగూడ మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీనివాస్‌శర్మకు అంగన్‌వాడీ టీచర్లు, బీఎల్‌ఓలు వినతిపత్రం అందజేశారు.

అందుబాటులో ఉండాలి

చందంపేట : బీఎల్‌ఓలు అందుబాటులో ఉండి, బూత్ పరిధిలో సమస్యలు పరిష్కరించాలని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి తెలిపారు. బుధవారం నేరెడుగొమ్ము మోడల్ స్కూల్‌లో బీఎల్‌ఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమాదేవి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

పెద్దఅడిశర్లపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచి పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ ఐలబోయిన వెంకటయ్య అన్నారు. బుధవారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని పోతిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో గత సంవత్సరం విద్యార్థుల సంఖ్య ముగ్గురు ఉండగా ప్రస్తుతం 60 మంది విద్యార్థులు పాఠశాలలో చేరారని తెలిపారు. విద్యార్థుల సంఖ్య పెంచినందుకు ఉపాధ్యాయులు విజయలక్ష్మి, పద్మకళను అభినందించారు. ఆయన వెంట గుడిపల్లి ఎంఈఓ సముద్రాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, పద్మకళ, ఏడుకొండల్ ఉన్నారు.

దాతల సేవలు అభినందనీయం

పెద్దవూర: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు అందిస్తున్న సేవలు అభినందనీయమని మండల విద్యాధికారి తరి రాములు అన్నారు. బుధవారం పెద్దవూర మండలంలోని సంగారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు సొంత ఖర్చులతో సమకూర్చిన టై, బెల్టు, బ్యాడ్జీలు, నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం హరికిషన్, సోలేటి ధనలక్ష్మి, పద్మమ్మ, వసుంధర, ఈదమ్మ, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

త్రిపురారం : మండల కేంద్రానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు సమర్థపు నర్సింహ అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. ఆయన మృతదేహానికి మన్నెం రంజిత్ యువసేన సభ్యులు నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ. 10 వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా సాగర్ నియోజక వర్గ బీజేపీ ఇన్‌చార్జ్ కంకణాల నివేదిత శ్రీధర్‌రెడ్డి రూ.10 వేలు, త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి రూ. 5 వేలు అందించారు.

సమాచార హక్కుసాధన కమిటీ జిల్లా ఇన్‌చార్జ్‌గా వినోద్‌కుమార్

మిర్యాలగూడ టౌన్ : సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జిల్లా ఇన్‌చార్జ్‌గా మిర్యాలగూడ మండలం బి.అన్నారం గ్రామానికి చెందిన కాతోజు వినోద్‌కుమార్ నియామకమయ్యారు. ఈమేరకు కమిటీ జాతీయ అధ్యక్షుడు చంటి బుధవారం హైదరాబాద్‌లో నియామక పత్రం అందజేశారు.

కదిలిన కార్మికలోకం

- సార్వత్రిక సమ్మెలో భారీగా పాల్గొన్న కార్మికులు
- కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లు ఎత్తివేయాలని డిమాండ్



నిడమనూరులో ధర్నా చేస్తున్న సీపీఎం, కార్మిక సంఘాల నాయకులు



కొండమల్లేపల్లి : దేవరకొండలో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



దామరచర్ల: ధర్నా చేస్తున్న నాయకులు

మిర్యాలగూడ: కార్మికుల సంక్షేమాన్ని నిర్వీర్యం చేసే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం మిర్యాలగూడ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు మల్లు గౌతంరెడ్డి, తిరుపతి రామ్మూర్తి పాల్గొన్నారు.

దామరచర్లలో..
దామరచర్ల మండల కేంద్రంలోని అద్దంకి– నార్కట్‌పల్లి రహదారిపై ప్రజా సంఘాల నాయకులు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో వినోద్‌నాయక్, ఉదయ్‌కుమార్, దయానంద్, పాపానాయక్, పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : సార్వత్రిక సమ్మెకు మద్దతుగా బుధవారం మిర్యాలగూడ ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కార్మికులకు పనిభద్రతను కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నేతలు ఎండీ సయ్యాద్, మల్లు గౌతమ్‌రెడ్డి, ఎంప్లాయిస్ యూనియన్, ఎస్‌డబ్ల్యూఎఫ్, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు తదితరులున్నారు.

ఐక్యంగా ఉద్యమించాలి
హాలియా : నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు యావత్ కార్మికవర్గమంతా ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా ఉద్యక్షుడు సైదులు అన్నారు. బుధవారం హాలియా సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ, ఐఎన్‌టీయూసీ నాయకులు పాదిల శ్రీను, షేక్ అన్వరుద్దీన్, రేబెల్లి వెంకటేశ్వర్లు, సైయ్యద్ హుస్సేన్, చిరంజీవి, వెంకటయ్య పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
డిండి: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం డిండి మండల కేంద్రంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పీపీఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ మైనోద్దిన్, మండల కార్యదర్శి కనకాచారి, సహాయ కార్యదర్శి శైలేష్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నవీన్, లింగమయ్య, జవహర్ పాల్గొన్నారు.

పెద్దవూర: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్‌కే బషీర్ అన్నారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా సీఐటీయూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం పెద్దవూర మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా నాయకుడు చిరు నాగార్జున, దోరెపల్లి మల్లయ్య, ఊరె ప్రభాకర్, బొడ్డు మల్లేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

మిర్యాలగూడ అర్బన్: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా విద్యుత్ డీఈ కార్యాలయం ఎదుట కార్మికులు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో డీఈ శ్రీనివాస చారి పాల్గొన్నారు. కార్మిక వ్యతిరేక చట్టాలపై అన్ని రంగాల కార్మికులు ఐక్యంగా ఉండి ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిడమనూరు: నిడమనూరులో వివిధ కార్మిక సంఘాలతో కలిసి సీపీఎం నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను, సీపీఎం మండల కార్యదర్శి కందుకూరి కోటేష్, కుంచెం శేఖర్, కోదండా చరణ్ రాజ్, వింజమూరి శివ, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

మాడుగులపల్లి: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా బుధవారం మాడుగులపల్లి మండల కేంద్రంలో ప్రజాసంఘాల నాయకులు నిరసన తెలిపారు. రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు రొండి శ్రీనివాస్, దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, నాగమణి పాల్గొన్నారు.

వేములపల్లి: కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం వేములపల్లి మండల కేంద్రంలో నిరసన వ్యక్తం తెలిపారు.

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండల కేంద్రంలో వివిధ రంగాల్లో పని చేస్తున్న అసంఘటిత రంగ కార్మికులు బుధవారం నిరసన తెలిపారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి జటంగి సైదులు, ఆశా వర్కర్లు తదితరులున్నారు.

కొండమల్లేపల్లి : కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు వత్తాసు పలుకుతోందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి ఆరోపించారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా కొండమల్లేపల్లిలో బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల నాయకులు, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, ఆటో సంఘం నాయకులు పాల్గొన్నారు.

పోరాటం ఉధృతం చేయాలి
చింతపల్లి: కార్మిక హక్కుల సాధనకు పోరాటం ఉధృతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్య అన్నారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం చింతపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మోదీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడే సంఘాలకు తమ మద్దతు అని తెలిపిన రేవంత్ రెడ్డి 8 గంటల పని దినాన్ని 10 గంటలుగా మారుస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి, ఉడుగుండ్ల రాములు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పోలే యాదయ్య, సీపీఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, అంజల్ రావు, ఎండీ శంషొద్దీన్, సర్దార్, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య అన్నారు. అఖిల భారత సార్వత్రిక సమ్మె పిలుపు మేరకు దేవరకొండలో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సీఐటీయూ కార్యాలయం నుంచి మీనాక్షి చౌరస్తా మీదుగా దేవరకొండ ఆర్డీఓ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఓడపల్లి యాదగిరి, బిజిలి లింగయ్య, నాగటి నాగరాజు, బుడిగ వెంకటేష్, భాస్కర్, సతీష్, కాశయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

గుర్రంపోడు : మండల కేంద్రంలో బుధవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో, ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు వనమాల కామేశ్వర్, అఖిల భారత విప్లవ రైతు సంఘం అధ్యక్షుడు జక్కుల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

త్రిపురారం : నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి సీపీఎం మండల కార్యదర్శి దైద శ్రీను డిమాండ్ చేశారు. బుధవారం త్రిపురారం మండల కేంద్రంలో ఎస్‌ఎస్పీ క్యాంపు నుంచి మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్ వరకు వివిధ పార్టీల అనుబంధ కార్మిక సంఘాల సభ్యులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. సాగర్ రోడ్డుపై ధర్నా చేశారు. కార్యక్రమంలో సీఐటీయు మండల కన్వీనర్ నల్లగొండ నర్సిరెడ్డి, పోలె సాంబయ్య, సురేష్, మాసారపు నర్సింహ పాల్గొన్నారు.

చందంపేట : నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనెరామస్వామి అన్నారు. చందంపేట మండలంలోని పోలేపల్లి స్టేజీ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఉప్పునూతల వెంకటయ్య, మొగిళ్ల వెంగలయ్య, జూలూరి మహేష్, మల్లయ్య పాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లి : దేశ వ్యాప్త సమ్మెతో మోదీ ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ అన్నారు. బుధవారం గుడిపల్లి, పెద్దఅడిశర్లపల్లి మండలాల్లో సార్వత్రిక సమ్మె నిర్వహించారు.



మిర్యాలగూడ డిపో ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆర్టీసీ జేఏసీ నాయకులు



హాలియాలో రాస్తారోకో చేస్తున్న కార్మిక సంఘం నేతలు



వేములపల్లిలో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు



మాడుగులపల్లి: నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు



త్రిపురారంలో సాగర్ రోడ్డుపై నిరసన తెలుపుతున్న కార్మికులు



అడవిదేవులపల్లిలో..



డిండి: డిండి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ కార్మికులు

బదిలీపై వెళ్తున్న ఆర్టీసీ ఉద్యోగులకు సన్మానం



బదిలీపై వెళ్తున్న వారిని సన్మానిస్తున్న దేవరకొండ ఆర్టీసీ అధికారులు

కొండమల్లేపల్లి : దేవరకొండ ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహిస్తున్న మెకానిక్ కేఎస్.రెడ్డి యాదగిరి గుట్ట ఆర్టీసీ డిపోకు, మోతీలాల్ కోదాడకు లీడింగ్ హ్యాండ్‌గా పదోన్నతి పొందడంతో బుధవారం దేవరకొండ ఆర్టీసీ డిపోలో సన్మానించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ తల్లాడ రమేష్ బాబు మాట్లాడుతూ లీడింగ్ హ్యాండ్ కృష్ణయ్య మిర్యాలగూడ డిపోకు, నల్లగొండ ఆర్టీసి డిపోలో విధులు నిర్వహిస్తున్న యాదగిరి లీడింగ్ హ్యాండ్ ప్రమోషన్‌పై దేవరకొండకు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు, అసిస్టెంట్ ఇంజనీర్ వెలుగు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

తండాకు నీరందించాలి

మిర్యాలగూడ టౌన్ : వాటర్ ట్యాంకు తండాలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని తండా వాసులు బుధవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి పంచాయతీ భవనం లేకపోవడంతో ప్రస్తుతం పాఠశాలలో నడిపిస్తున్నామని, వాటర్ ట్యాంకు తండాకు మున్సిపాలిటీ పరిధిలో 5 కుంటల భూమిని కేటాయిస్తే గ్రామ పంచాయితీ భవనాన్ని నిర్మించుకుంటామని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో శంకర్‌నాయక్, నాగు, కృష్ణ, నాగరాజు, రాము, నాగులు, రవి, రవికుమార్, ఉప్మీ, సంతోష్, సుధాకర్ ఉన్నారు.

సర్వే చేయాలని వినతి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మిగిలిన భూములను సర్వే చేయాలని కోరుతూ బుధవారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు రైతులు వినతిపత్రం అందజేశారు. భూ సర్వే నిర్వహించిన సమయంలో కొందరు రైతులు వలస వెళ్లడంతో అందుబాటులో లేరని తెలిపారు. సర్వే చేయని భూములను గుర్తించి సర్వే చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు మేరావత్ ముని నాయక్, రైతులు పాండు నాయక్, సత్యా, రంగ, ప్రభ, దస్రు, భీమా, బాలు, హనుమంతు ఉన్నారు.

మహిళలకు అండగా షీటీమ్

మిర్యాలగూడ టౌన్ : మహిళలకు షీటీమ్ అండగా ఉంటుందని, ఎవరైనా వేధింపులకు గురిచేస్తే సమాచారం అందించాలని షీటీమ్ ఏఎస్సై తబిత అన్నారు. బుధవారం మిర్యాలగూడ మండలంలోని అవంతిపురం గ్రామంలో తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.

వేతనాలు ఇప్పించాలి

పెద్దవూర: మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇప్పించాలని పెద్దవూరలోని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు బుధవారం ఎంపీడీఓ ఉమాదేవికి వినతిపత్రం అందజేశారు. వారిలో బి.ఎల్లయ్య, రాంబాబు, వెంకన్న, సైదులు, రాము, శ్రీనివాస్ ఉన్నారు.

ఆదర్శం.. ఆ ఉపాధ్యాయురాలు

- ఉద్యోగం చేస్తున్న ఊళ్లోనే ఇల్లు అద్దెకు
- తన కుమార్తెను కూడా ప్రభుత్వ బడికే పంపిస్తున్న టీచరమ్మ



తన కుమార్తెకు పాఠాలు చెబుతున్న ఉషారాణి

చందంపేట : ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న ఊళ్లోనే ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటూ.. తన కుమార్తెను ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఉపాధ్యాయురాలు లావూరి ఉషారాణి. రామన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన ఈ టీచరమ్మ ఉద్యోగ రీత్యా చందంపేట మండలంలోని కాట్రావత్‌తండా ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహించింది. కాట్రావత్‌తండాలో విద్యార్థుల సంఖ్య లేకపోవడంతో డిప్యుటేషన్‌పై గాగిళ్లాపురం ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు.

మూడేళ్లుగా గ్రామంలోనే అద్దెకు ఉంటూ..
ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఉషారాణి గాగిళ్లాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మూడు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారు. గ్రామంలోనే ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. తన కుమార్తెను కూడా తాను పని చేసే పాఠశాలలోనే చేర్పించారు. ఉషారాణి గాగిళ్లాపురంలో విధులు చేపట్టాక ఇక్కడ విద్యార్థుల సంఖ్య పెరగడం గమనార్హం. అలాగే విధులు ముగియగానే ఇంటి వద్ద గ్రామానికి చెందిన విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్లు కూడా చెబుతున్నారు.

కేసులు పెండింగ్‌లో ఉంచొద్దు




రికార్డులను పరిశీలిస్తున్న ఏఎస్పీ మౌనిక

డిండి: పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులను పెండింగ్‌లో ఉంచొద్దని దేవరకొండ ఏఎస్పీ మౌనిక అన్నారు. బుధవారం డిండి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. ఆమె వెంట డిండి రూరల్ సీఐ బీసన్న, ఎస్ఐ రాజు ఉన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలి
చందంపేట : వ్యాపారస్తులు, ప్రజలు సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని ఏఎస్పీ మౌనిక అన్నారు. బుధవారం కమ్యూనిటీ పోలింగ్‌లో భాగంగా పోలేపల్లి స్టేజీ వద్ద ఏర్పాటు చేసిన 7 సీసీ కెమెరాలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో డిండి సీఐ బీసన్న, చందంపేట ఎస్ఐ లోకేష్, పార్వతీపుత్ర హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు హరీష్‌చారి, రవీందర్‌రెడ్డి, నరేష్, జనార్దన్ పాల్గొన్నారు.

సంఘాల్లోకి మహిళలను ఆహ్వానించాలి



కళాజాతలో పాల్గొన్న అడిషనల్ డీఆర్‌డీఓ

మాడుగులపల్లి: ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు అన్ని గ్రామ సంఘాల్లో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలు నిర్వహించి సంఘాల్లో లేని 18–59 సంవత్సరాలలోపు మహిళలను సంఘాల్లోకి ఆహ్వానించనున్నట్లు అడిషనల్ డీఆర్‌డీఓ శ్రవణ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వం ద్వారా మహిళలకు అందిస్తున్న పథకాలపై బుధవారం మాడుగులపల్లి మండల కేంద్రంలో సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం బాషపాక చంద్రశేఖర్, డీఆర్‌డీఏ ఏపీఎం ప్రభాకర్, సీసీలు సైదులు, నాగయ్య, స్వాగత్‌రావు, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

హైవేపై ప్రమాదకర మూలమలుపుల పరిశీలన



మూలమలుపులను పరిశీలిస్తున్న నేషనల్ హైవే అథారిటీ ఇంజనీర్, డీటీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్

సాక్షి ఎఫెక్ట్..

నాగార్జునసాగర్: సాగర్ హైవేపై గల ప్రమాదకర మూలమలుపులపై ఈ నెల 5న 'ఆ దారిలో వెళ్తున్నారా.. జాగ్రత్త'! శీర్షికన సాక్షి దినపత్రిక కథనం ప్రచురించింది. ఈమేరకు కలెక్టర్ ఆదేశాలతో డిస్ట్రిక్ ట్రాఫిక్ రిసోర్స్ బ్యూరో (డీటీఆర్‌బీ) ఇన్‌స్పెక్టర్ అంజయ్య, హైవే అథారిటీ ఇంజనీర్ అంజయ్య, రోడ్డు కాంట్రాక్టర్, బుధవారం సాగర్ పరిధిలోని హైవేపై ప్రమాదకర మూలమలుపులను పరిశీలించారు. రోడ్డు వెడల్పు, సూచిక బోర్డుల ఏర్పాటుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో సమీక్షించారు. వారి వెంట నేషనల్ హైవే అథారిటీ ఇంజనీర్స్ సాయిరాం, వెంకటేశ్వర్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనునాయక్ ఉన్నారు.

శవపేటికపై ఇనుప గ్రిల్స్ చోరీ

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలోని తాళ్లగడ్డ–షాబునగర్ మధ్యలో ఉన్న హిందూ శ్మశాన వాటికలోని శవపేటిక ఇనుప గ్రిల్స్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ విషయంపై బీజేపీ పట్టణ మాజీ కార్యదర్శి చిలుకూరి శ్యాం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మున్సిపల్ డీఈఈ వెంకన్నకు ఫోన్‌లో సమాచారం అందించగా.. శ్మశాన వాటికను సందర్శించిన అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయమని ఆదేశించినట్లు తెలిపారు.

బిల్లులు విడుదల చేయాలి

మిర్యాలగూడ అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన బిల్లులు విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుర్ర సైదానాయక్ కోరారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని గాంధీపార్క్‌లో గల పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

భవిష్యత్ బీఆర్‌ఎస్ పార్టీదే

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

త్రిపురారం : భవిష్యత్ బీఆర్‌ఎస్ పార్టీదేనని, బీఆర్‌ఎస్ అనుబంధ సంఘాల సభ్యులకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి తెలిపారు. బుధవారం త్రిపురారం మండల కేంద్రంలోని మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి నివాసంలో ఎమ్మెల్సీ సమక్ష్యంలో కాంగ్రెస్ పార్టీ నుంచి విద్యార్థి విభాగం నాయకులు బీఆర్‌ఎస్వీలో చేరారు. ఈ సందర్భంగా వారికి బీఆర్‌ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ జిల్లా ఉపాధ్యక్షుడు కట్ట విక్రమ్, సాగర్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఏళ్ల మహేందర్ రెడ్డి, ఖాసీం, బంటు రాము, నక్క శ్రీధర్, రాచూరి రిషి, సతీష్, సిద్ధు, నాగరాజు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ
నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 37 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి బుధవారం స్థానికంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి, పావనగుండ్ల వెంకటాచారి, అనుముల శ్యాం సుందర్ రెడ్డి, బైరం కృష్ణ, జంగిలి శ్రీనివాస్, అనుముల శ్రీనివాస్ రెడ్డి, గుండెబోయిన వెంకటేశ్వర్లు, గోపు కొటిరెడ్డి, నగిరి శ్రీనివాస్, కొండల్, బొడ్డు చిన్న సాయిలు పాల్గొన్నారు.

రివర్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ అధికారుల విచారణ

- ఆరోగ్యశ్రీ కింద చేరిన రోగుల నుంచి డబ్బులు తీసుకున్నట్లు నిర్ధారణ
- రోగి మృతిపైనా ఆరా తీసిన జిల్లా ఆరోగ్యశ్రీ బృందం
- యాజమాన్యానికి షోకాజ్ నోటీసు జారీ



వివరాలు తెలుసుకుంటున్న ఆరోగ్యశ్రీ బృందం

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని రివర్ ఆస్పత్రిలో వైద్య సేవలు సరిగ్గా అందక రోగి మృతిచెందడంపై జిల్లా ఆరోగ్య శ్రీ బృందం బుధవారం విచారణ చేపట్టింది. ఈ నెల 1న అడవిదేవులపల్లి మండలం కొత్తనందికొండ గ్రామానికి చెందిన సుంకిశాల ముత్తయ్య గుండె నొప్పితో బాధపడుతూ రివర్ ఆస్పత్రిలో చేరగా.. ఈనెల 3న మృతిచెందాడు. డబ్బు చెల్లించలేదని చికిత్స చేయకుండా కాలయాపన చేయడంతోనే ముత్తయ్య మృతి చెందాడని ఆరోపిస్తూ అతడి బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఈమేరకు విచారణకు వచ్చిన ముగ్గురు ఆరోగ్యశ్రీ జిల్లా అధికారులు రోగి మృతిపై ఆస్పత్రి యాజమాన్యాన్ని వివరణ కోరారు. అనంతరం ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందుతున్న రోగుల వార్డులకు వెళ్లి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందేందుకు వచ్చిన రోగుల వద్ద నిబంధనకు విరుద్ధంగా డబ్బులు తీసుకున్నట్లు గుర్తించిన ఆరోగ్య శ్రీ బృందం సభ్యులు రివర్ ఆస్పత్రి యాజమాన్యానికి షోకాజ్ నోటీసు ఇచ్చారు. వారంలోగా లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశించారు. అంతే కాకుండా గుండెకు వేయాల్సిన స్టంట్లు ఆరోగ్యశ్రీలో నాసిరకంగా ఉంటాయని రోగులను భయభ్రాంతులకు గురి చేసి ప్రైవేట్‌గా స్టంట్లు వేసి డబ్బులు వసూలు చేస్తున్నారని రోగులు వారి దృష్టికి తెచ్చినట్లు సమాచారం. ఆరోగ్యశ్రీ లో చికిత్స చేయించుకుంటున్న రోగుల వద్ద డబ్బులు వసూలు చేయడం నిబంధనలకు విరుద్ధమని, ఆస్పత్రి యాజమాన్యం రోగుల నుంచి వసూలు చేసిన డబ్బులను తిరిగి ఇవ్వాలని ఆదేశించినట్లు ఆరోగ్య శ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ శివప్రసాద్, జిల్లా మేనేజర్ నాగరాజు, డివిజన్ అధికారి వీరయ్య తెలిపారు.